క్లుప్తంగా

ఎల్లమ్మకు ప్రత్యేక పూజలు


అలంకరణలో అమ్మవారు

తుక్కుగూడ: మున్సిపాలిటీ పరిధిలోని రావిర్యాల శ్రీ సూర్యగిరి ఎల్లమ్మకు మంగళవారం ప్రత్యేక పూజలు చేశారు. అమ్మవారి దర్శనం కోసం భక్తులు ఉదయం నుంచే క్యూలో ఉన్నారు. ఆలయం ప్రాంగణంలో సామూహిక సత్యానారాయణ స్వామి వ్రతాలు చేశారు. నాగ దేవతకు పుట్టలో పాలు పోసి కొలిచారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ రెడ్డిగళ్ల రత్నం, ఈఓ మోహన్‌రావు, సిబ్బంది కాశీనాథ్, పూజారులు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

వారిపై చర్యలు తీసుకోండి


కమిషనర్‌కు వినతిపత్రం అందజేస్తున్న చికెన్ షాపు నిర్వాహకులు

తుక్కుగూడ: మున్సిపాలిటీ కేంద్రంలోని చికెన్ షాపు నిర్వాహకులు తమ సమస్యల పరిష్కారించాలని డిమాండ్ చేస్తూ మంగళవారం కమిషనర్ వాణిని కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు.. తుక్కుగూడలో నూతనంగా ఏర్పాటు చేసిన ఓ సంస్థ చికెన్ షాపు నిర్వాహకులు తమకు సహకరించడం లేదని, వారిపై చర్యలు తీసుకోవాలని కమిషనర్‌కు వినతిపత్రం అందజేశామన్నారు. కార్యక్రమంలో రాకేష్‌గౌడ్, ఆంజనేయులు, రాజు, గౌస్ తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ మండల కార్యవర్గ నియామకం

మహేశ్వరం: బీజేపీ మండల నూతన కార్యవర్గాన్ని పార్టీ మండల అధ్యక్షుడు టి.యాదిష్ మంగళవారం ప్రకటించారు. మండల ఉపాధ్యక్షులుగా యాదగిరి, నేనావత్ రూప్‌సింగ్, విద్యాసాగర్‌రెడ్డి, మమత ముదిరాజ్, ఎం.చెన్నారెడ్డి, జనరల్ సెక్రటరీలుగా ఉపేందర్, శ్రవణ్, కార్యదర్శులుగా అనితానాయక్, దేవేందర్, శ్రీనివాస్, శ్రీనివాస్‌రెడ్డి, నర్సింహ, కోశాధికారిగా ఆనంద్‌గౌడ్, కార్యవర్గ సభ్యులుగా మల్లేష్, సురేందర్‌చారి, కరుణాకర్, బాల్‌రాజ్, రాజవర్ధన్‌రెడ్డి, దానయ్యలను ఏకగ్రీవంగా ఎంపిక చేసి నియామక పత్రాలు అందజేశారు. మండలంలో గ్రామాల్లో పార్టీ బలోపేతం కోసం ప్రతి నాయకుడు, కార్యకర్త కృషి చేయాలని కోరారు. త్వరలో జరిగే స్థానిక సంస్థల ఎన్నికల్లో బీజేపీ బలపర్చిన అభ్యర్థుల గెలుపే లక్ష్యంగా పని చేయాలని సూచించారు.

విద్యార్థులకు క్రీడా దుస్తుల పంపిణీ


స్పోర్ట్స్ డ్రెస్సులు అందజేస్తున్న నాయకులు, ఉపాధ్యాయులు

మహేశ్వరం: పేద విద్యార్థుల విద్యాభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని బీఆర్ఎస్ మండల యువ నాయకులు మర్యాద రాఘవేందర్‌రెడ్డి అన్నారు. మంగళవారం మండల పరిధిలోని మన్సాన్‌పల్లి ప్రభుత్వ పాఠశాలలో ఆయన జన్మదినం సందర్భంగా పాఠశాలలో చదివే 120 మంది విద్యార్థులకు క్రీడా దుస్తులు పంపిణీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులు కష్టపడి చదివి ఉన్నత శిఖరాలను చేరుకోవాలని సూచించారు. ప్రభుత్వ పాఠశాలలో నాణ్యతతో కూడిన విద్య అందిస్తుందన్నారు. సమస్యలను ఎమ్మెల్యే సబితా రెడ్డి దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తామన్నారు. కార్యక్రమంలో మండల విద్యాధికారి కస్నానాయక్, ఉపాధ్యాయులు, విద్యార్థులు, విద్యాకమిటీ సభ్యులు పాల్గొన్నారు.

బీటీ రోడ్డు ఏర్పాటుపై హర్షం

కడ్తాల్: ఎన్నో ఏళ్లుగా బీటీ రోడ్డు కోసం ఎదురు చూస్తున్న తండావాసులకు ఎట్టకేలకు మోక్షం లభించింది. 2022 ఏడాది చివర్లో కడ్తాల్ నుంచి గుర్లకుంటతండా వరకు కిలోమీటరు మేరకు బీటీ రోడ్డు నిర్మాణానికి అప్పటి ప్రభుత్వం సీఆర్ఆర్ నిధులు రూ.కోటి నిధులు మంజూరు చేసింది. సాంకేతిక కారణాలతో పనులు ప్రారంభించి నత్తనడకన సాగుతూ వచ్చాయి. దీంతో తండావాసులు స్థానిక ఎమ్మెల్యే, ఎంపీ దృష్టికి తీసుకెళ్లి రోడ్డు పనులు ప్రారంభించేలా చర్యలు తీసుకున్నారు. ఈ నేపథ్యంలో మంగళవారం సంబంధిత అధికారులు స్పందించి బీటీ రోడ్డు పనులు ప్రారంభించి పూర్తి చేశారు. దీంతో గుర్లకుంట తండావాసులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

అధిక లోడు.. వెతలు చూడు

- పరిమితికి మించి వెళ్తున్న కంకర, డస్ట్ లారీలు
- వాహనదారులకు సంకటంగా మారుతున్న వైనం
- పాడవుతున్న రహదారులు
- పట్టించుకోని ఆర్టీఏ అధికారులు


శ్రీశైలం రహదారిపై అధిక లోడుతో వెళ్తున్న టిప్పర్

కందుకూరు: ఓవర్ లోడ్‌తో తిరిగే భారీ వాహనాలతో రోడ్డుపై ప్రయాణించే వాహనదారులు, ప్రజలు అవస్థలు పడుతున్నారు. కంకర, డస్టు, మట్టి తదితరాలు నిర్దేశించిన దానికన్నా అధికంగా నింపుకొని వెళ్లే క్రమంలో అవి కింద పడటం, లేదా డస్టు వంటివి కళ్లల్లో పడటంతో ప్రమాదకరంగా మారింది. అయినా సంబంధిత ఆర్టీఏ అధికారులు తమకు పట్టనట్లుగా వ్యవహరిస్తున్నారు. ఇదీ కందుకూరు మండలంతో పాటు పలు మండలాల్లో ఉన్న ప్రస్తుత పరిస్థితి.

కళ్లలో పడి ప్రమాదాలు

కందుకూరు మండలంతో పాటు కడ్తాల్, ఆమనగల్లు మండలాల వైపు ఉన్న క్వారీల నుంచి కంకర, డస్టు, మొరం, క్వాడ్జ్ వంటివి ఇతర ప్రాంతాలకు లారీలు, టిప్పర్ల ద్వారా నిత్యం తరలిస్తున్నారు. వాస్తవంగా నింపాల్సిన బరువు కంటే అదనంగా తరలిస్తున్నారు. 20 టన్నుల సామర్థ్యం ఉన్న లారీలో 40 నుంచి 50 టన్నుల మేర నింపి తరలిస్తున్నారు. దీంతో రోడ్లు పాడవుతున్నాయి. మరో పక్క అధికంగా నింపిన కంకర, డస్టు వంటివి కింద పడుతూ ఇతర వాహనదారులకు సంకటంగా మారుతున్నాయి. వెనక వచ్చే ద్విచక్ర వాహనదారుల కళ్లల్లో పడి పలుమార్లు ప్రమాదాల బారిన పడిన సంఘటనలు చోటు చేసుకున్నాయి. కార్లపై పడి అద్దాలు పగిలిపోతున్నాయి. సింగిల్ రహదారుల నుంచే వచ్చే క్రమంలో అధిక బరువుతో వస్తున్న లారీలు ఇతర వాహనదారులకు సైడ్ ఇవ్వకపోవడంతో ఇబ్బందిగా మారుతుంది. ఆ సమయంలో ప్రమాదాల బారిన పడి పలువురు గతంలో మృత్యువాత పడిన సంఘటనలున్నాయి. అయినా సంబంధిత అధికారులు మాత్రం తమకు సంబంధం లేనివిధంగా వ్యహరిస్తున్నారని పలువురు వాపోతున్నారు. ఉన్నతాధికారులు స్పందించి అధిక లోడ్‌తో వెళ్లే వాహనాలపై చర్యలు తీసుకుని ప్రమాదాలను నివారించాలని పలువురు కోరుతున్నారు.


మీర్‌పేట: సహాయనిధి చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే సబితారెడ్డి

సమస్యల పరిష్కారానికి వినతి

పహాడీషరీఫ్: జల్‌పల్లి మున్సిపాలిటీలో నెలకొన్న సమస్యలు పరిష్కారమయ్యేలా చొరవ చూపాలని బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు ఎమ్మెల్యే సబితారెడ్డిని కోరారు. ఈ మేరకు పార్టీ నాయకులు పల్లపు శంకర్, షేక్ అఫ్జల్, యంజాల అర్జున్ ఆమెను మంగళవారం కలిసి సమస్యలను వెల్లడించారు. అవుట్‌లెట్ సమస్య కారణంగా శ్రీరాం కాలనీ, వాదే ముస్తఫా బస్తీలో ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. పారిశుద్ధ్యం, మురుగు సమస్య తలెత్తకుండా మున్సిపల్ అధికారులను ఆదేశించాలని కోరారు. వెంటనే స్పందించిన ఆమె నిర్వహణ పనులలో జాప్యం లేకుండా చూసుకోవాలని కమిషనర్‌కు ఫోన్ ద్వారా సూచించారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కు అందజేత

మీర్‌పేట: ముఖ్యమంత్రి సహాయ నిధిని పేద ప్రజలు సద్వినియోగం చేసుకుని ఆర్థిక లబ్ధి పొందాలని మహేశ్వరం ఎమ్మెల్యే సబితారెడ్డి సూచించారు. మీర్‌పేట కార్పొరేషన్ పరిధి లెనిన్‌నగర్‌కు చెందిన హారికకు మంజూరైన రూ.18వేల చెక్కును మంగళవారం క్యాంపు కార్యాలయంలో ఆమె తండ్రి సత్యనారాయణరెడ్డికి ఎమ్మెల్యే అందజేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు అర్కల కామేశ్‌రెడ్డి, దిండు భూపేష్‌గౌడ్, జటావత్ శ్రీనునాయక్, సిద్దాల బీరప్ప, సునీత బాలరాజ్ పాల్గొన్నారు.

యథేచ్ఛగా చెత్త పారబోత!


- ఎక్కడి నుంచో తెచ్చి జల్‌పల్లి చెరువు పరిసరాల్లో డంపు


కార్గో రోడ్డు పక్కన పడేసిన వ్యర్థాలు

పహాడీషరీఫ్: పర్యావరణ హితాన్ని మరిచిన కొందరు ఇతర ప్రాంతాల నుంచి సంచులలో చెత్తా చెదారాలను తీసుకొచ్చి జల్‌పల్లి చెరువు పరిసరాలలో పడేసి ఈ ప్రాంతాన్ని అపరిశుభ్రంగా మారుస్తున్నారు. ముత్యాలమ్మ ఆలయం నుంచి డీసీ దాబా వైపు వెళ్లే కార్గో రోడ్డులో లక్ష్మీగూడ, వాంబే కాలనీ, కాటేదాన్, ఉడంగడ్డ, పాతబస్తీ తదితర ప్రాంతాల నుంచి గుర్తు తెలియని వ్యక్తులు పశు, మెడికల్, పరిశ్రమల వ్యర్థాలను సంచులలో మూటగా కట్టుకొని ఆటోలలో తీసుకొచ్చి చీకటి మాటున యథేచ్ఛగా పడేసి పోతున్నారు. జల్‌పల్లి కమాన్ వద్ద ప్రస్తుతం పార్కు ఏర్పాటుతో అక్కడ వేయడానికి వీలు కాకపోవడంతో, కొంచెం ముందుకు రోడ్డు పక్కన నిర్మానుష్య ప్రదేశాలలో కూడా ఇలాంటి వ్యర్థాలనే పడేస్తున్నారు.

దుర్గంధభరితం

కళేబరాలు, ఇతర వ్యర్థాలను పడేస్తుండడంతో వెలువడుతున్న తీవ్ర దుర్గంధంతో అటుగా రాకపోకలు సాగించే వాహనదారుల ముక్కుపుటాలదురుతున్నాయి. ఎక్కడో వ్యక్తులను హత్య చేసి మృతదేహాలను సంచిలో కుక్కిన ఘటనలు కూడా పలుమార్లు వెలుగు చూశాయి. అప్పుడప్పుడు ఇలాంటి ఆటోవాలాలను మున్సిపల్ సిబ్బంది పట్టుకొని జరిమానాలు విధించినా మార్పు కనిపించడం లేదు. ఒక్కోసారి ఇలాంటి వారిని విడిపించడానికి స్థానిక రాజకీయ నాయకులే జోక్యం చేసుకుంటుండడంతో పరిస్థితిలో మార్పు రావడం లేదు. ఈ విషయంలో మున్సిపల్ అధికారులు కఠినంగా వ్యవహరించి, అవసరమైన మేరకు సీసీ కెమెరాలు కూడా ఏర్పాటు చేసి పోలీసులకు ఫిర్యాదు చేయాల్సిన అవసరం ఉందని వాహనదారులు కోరుతున్నారు.


కందుకూరు రహదారిపై లైట్ల వెలుగులో ప్రయాణిస్తున్న వాహనాలు

కమ్మేసిన పొగ మంచు

కందుకూరు: మండల పరిధిలో పొగ మంచుతో వాహనదారులు ఇబ్బందులు పడ్డారు. మంగళవారం ఉదయం 6 గంటల నుంచి 7 గంటల వరకు మంచు దుప్పటిలా కప్పేసింది. దీంతో వాహనదారులు లైట్ల వెలుగులో ప్రయాణించాల్సి వచ్చింది. పరిసరాలు అన్ని మంచు కప్పేయడంతో ఉదయమే పనులకు వెళ్లే వారు కొంత సేపు ఆగాల్సి వచ్చింది.

మార్కెట్‌లో అభివృద్ధికి ప్రతిపాదనలు

ఆమనగల్లు: పట్టణంలోని వ్యవసాయ మార్కెట్ యార్డులో వివిధ అభివృద్ధి పనులు చేపట్టడానికి పలు ప్రతిపాదనలు ప్రభుత్వానికి పంపినట్లు ఆమనగల్లు మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ యాట గీత అన్నారు. మార్కెట్‌యార్డు కార్యాలయంలో మంగళవారం చైర్‌పర్సన్ అధ్యక్షతన మార్కెట్ కమిటీ సమావేశం జరిగింది. మార్కెట్ యార్డులోని ఓపెన్ ప్లాట్‌లో షెడ్డు నిర్మించాలని, గోదాం మరమ్మతులు చేపట్టాలని, అవసరమైన చోట సీసీ రోడ్డు నిర్మించాలని ప్రతిపాదనలు చేశారు. అనంతరం యాట గీత మాట్లాడుతూ.. రైతుల సంక్షేమమే లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తుందని చెప్పారు. త్వరలో ధాన్యం, పత్తి కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయనున్నట్లు చెప్పారు. సమావేశంలో మార్కెట్ వైస్ చైర్మన్ భాస్కర్‌రెడ్డి, కార్యదర్శి శ్రీనివాస్‌రెడ్డి, సభ్యులు రమేశ్, నరేశ్‌నాయక్, రవీందర్, జంగయ్య, యాదయ్య, సంపత్‌కుమార్, శ్యాంసుందర్ రెడ్డి, అజీం, శ్రీశైలం తదితరులు పాల్గొన్నారు.

ట్రిపుల్‌ఆర్ అలైన్‌మెంట్ మార్చాలి


దీక్షలో కూర్చున్న సీపీఎం జిల్లా కార్యదర్శి యాదయ్య, నాయకులు

- సీపీఎం జిల్లా కార్యదర్శి యాదయ్య

ఆమనగల్లు: ట్రిపుల్‌ఆర్ అలైన్‌మెంట్‌ను వెంటనే మార్చాలని సీపీఎం జిల్లా కార్యదర్శి పగడాల యాదయ్య డిమాండ్ చేశారు. తలకొండపల్లి మండల కేంద్రంలో మంగళవారం సీపీఎం మండల కార్యదర్శి గుమ్మడి కురుమయ్య ఆధ్వర్యంలో రీజనల్ రింగ్‌రోడ్డు భూ నిర్వాసిత రైతులతో కలిసి ఒకరోజు రిలే దీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా యాదయ్య మాట్లాడుతూ.. ట్రిపుల్‌ఆర్ నిర్మాణం పేరుతో నిరుపేద రైతుల భూములను లాక్కోవడం అన్యాయమన్నారు. ట్రిపుల్‌ఆర్ మొదటి అలైన్‌మెంట్‌ను మాత్రమే అమలు చేయాలని డిమాండ్ చేశారు. తరువాత బడాబాబుల భూములను కాపాడుతూ నిరుపేద రైతుల భూములను కోల్పోయేలా అలైన్‌మెంట్‌ను మార్చారని ఆరోపించారు. ప్రభుత్వం 2013 భూసేకరణ చట్టంలోని నిబంధనలకు అనుగుణంగా మొదట ప్రతిపాదించిన అలైన్‌మెంట్‌ను అమలు చేయాలన్నారు. కార్యక్రమంలో నాయకులు శివశంకర్, వెంకటయ్య, చెన్నయ్య, దైవానందం, పోచయ్య, మల్లేశ్, మాజీ సర్పంచ్ వెంకటస్వామి, ఎంపీటీసీ మాజీ సభ్యుడు లక్ష్మయ్య, నిర్వాసిత రైతులు మల్లేశ్, యాదగిరి, నవీన్, మాధవరెడ్డి, యాదయ్య, రాజు, ధర్మారెడ్డి, సుధాకర్, మహేశ్ తదితరులు పాల్గొన్నారు. ఈ రిలే దీక్షకు బీఆర్ఎస్ సీనియర్ నాయకులు సంఘీభావం తెలిపారు.

కబ్జాదారులపై చర్యలకు వినతి


కాలనీవాసులతో కలిసి మంత్రి శ్రీనివాస్‌రెడ్డిని కలిసిన కార్పొరేటర్ లచ్చిరెడ్డి

ఎల్‌బీనగర్: బీఎన్‌రెడ్డినగర్ డివిజన్ పరిధి శ్రీపురం కాలనీలో ఉన్న ఛత్రపతి శివాజీ పార్కును అక్రమంగా రిజిస్ట్రేషన్ చేసుకున్నారని, ఈ రిజిస్ట్రేషన్‌ను వెంటనే రద్దు చేసి కబ్జాకు పాల్పడిన వ్యక్తులపై చర్యలు తీసుకోవాలని కార్పొరేటర్ మొద్దుల చ్చిరెడ్డి కాలనీ వాసులతో కలిసి మంగళవారం రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డిని కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ.. హయత్‌నగర్ రెవెన్యూ పరిధిలోని శ్రీపురంకాలనీలో సర్వే నెంబర్ 200లో ఈ కాలనీ ఉందని,1967లో కాలనీ లేఅవుట్‌ను ఏర్పాటు చేసిన సందర్భంలో 5000 గజాల స్థలాన్ని పార్కు కోసం, క్రీడా మైదానాలకు వదిలివేయడం జరిగిందని మంత్రికి వివరించారు. అందులో భాగంగా పార్కు స్థలం కోసం జీహెచ్ఎంసీ నుంచి నిధులు మంజూరు చేసి పార్కును అభివృద్ధి చేసి కాలనీ వాసుల కోసం పార్కును నిర్మించారు. ఈ స్థలంపై కబ్జాదారుల కన్ను పడి పార్కును వనస్థలిపురం సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో తప్పుడు పత్రాలను సృష్టించి అక్రమంగా రిజిస్ట్రేషన్ చేయించుకున్నారన్నారు. మంత్రి స్పందించి పూర్తిస్థాయిలో విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చినట్లు కార్పొరేటర్ పేర్కొన్నారు. మంత్రిని కలిసిన వారిలో శ్రీధర్‌రెడ్డి, విఠల్‌రెడ్డి, విష్ణువర్ధన్‌రెడ్డి, రాజేందర్, చిగురింత శ్రీధర్‌రెడ్డి, రాములు ఉన్నారు.

రైతు బజారులలో కూరగాయల ధరలు

వనస్థలిపురం: సరూర్‌నగర్/ వనస్థలిపురంలోని రైతుబజారులలో కూరగాయల ధరలు.. టమాట 23, వంకాయ 40, బెండ 35, పచ్చిమిర్చి 35, కాకర 45, బీర 35, క్యాబేజి 23, ఫ్రెంచి బీన్స్ 45, క్యారెట్ 47, దొండ 23-28, చిక్కుడు 75, గోకర 50, బీట్‌రూట్ 45, క్యాప్సికం 60, ఆలు 24, దోస 18, సొర 15, పొట్ల 18, ఉల్లిగడ్డ 20, చామగడ్డ 23. ఈ ధరలు బుధవారం ఉదయం 9 గంటల వరకు మాత్రమే అమలులో ఉంటాయి.

కాలనీవాసులకు అండగా ఉంటాం

ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి


ఎమ్మెల్యే రంగారెడ్డితో శివాజీనగర్ కాలనీవాసులు

తుర్కయంజాల్: పురపాలక సంఘం పరిధి కమ్మగూడలోని సర్వే నంబర్ 240, 241, 242లోని శివాజీనగర్ కాలనీ వాసులకు అండగా ఉంటానని ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి భరోసానిచ్చారు. మాజీ కౌన్సిల్ ఫ్లోర్ లీడర్ కోశిక ఐలయ్య ఆధ్వర్యంలో మంగళవారం ఎమ్మెల్యేను తొర్రూర్‌లోని క్యాంపు కార్యాలయంలో కలిసి తాము ఎదుర్కొంటున్న ఇబ్బందులను వివరించారు. గడిచిన ఏడు నెలలుగా కాలనీలో సెక్షన్ 164 అమలులో ఉండటంతో నిర్మాణాలు చేపట్టుకోలేని పరిస్థితి ఉందన్నారు. గ్రామాల్లో ఉన్న పొలాలను అమ్ముకుని, అప్పులు చేసి ప్లాట్లు కొనుగోలు చేశామన్నారు. తక్షణమే సెక్షన్‌ను ఎత్తివేసేలా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. దీనికి సానుకూలంగా స్పందించిన ఎమ్మెల్యే.. తాను ఎప్పుడు పేదల పక్షమేనని, భూ కబ్జాదారులను అడ్డుకుంటామని ప్లాట్ల యజమానులకు ధైర్యం ఇచ్చారు. అనంతరం ఆర్డీఓ అనంత్‌రెడ్డితో ఫోన్‌లో మాట్లాడుతూ.. వెంటనే సెక్షన్ 164 ఎత్తివేయాలని, పోలీస్ శాఖతో చర్చించి సమస్యను పరిష్కరించాలని సూచించారు.

రూ.18 లక్షలతో ఆధునిక ప్లేపార్కు


స్థానికులతో మాట్లాడుతున్న రాజశేఖర్‌రెడ్డి

లింగోజిగూడ: డివిజన్ పరిధి జనప్రియా అపార్ట్‌మెంట్స్ చిన్నారుల సౌకర్యార్థం రూ.18 లక్షలతో అధునికి ప్లే పార్కు నిర్మాణం చేపడుతున్నట్లు లింగోజిగూడ కార్పొరేటర్ దరల్పి రాజశేఖర్‌రెడ్డి అన్నారు. మంగళవారం ఆయన నిర్మాణ పనులను పరిశీలించి మాట్లాడారు. ఒకప్పుడు జనప్రియ అపార్ట్‌మెంట్ ప్రాంతం నిర్లక్ష్యానికి గురైందని, కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తర్వాత ప్రతి కాలనీకి కొత్త ఊపిరి వచ్చిందన్నారు. ప్రజల సహకారం, అధికారుల చొరవతో సీసీరోడ్డు, వీధి దీపాలు, ఓపెన్ జిమ్‌లు, డ్రైనేజీ వ్యవస్థ సదుపాయాలు కల్పించామన్నారు. లింగోజిగూడ డివిజన్ అభివృద్ధికి ప్రాజెక్టులను రూపొందించడం జరిగిందని, దశలవారీగా పనులు చేపడుతున్నామన్నారు. కార్పొరేటర్ వెంట ఆంజనేయులు గౌడ్, జ్యోతిరెడ్డి, శాంత, కళ, మానసా, నవత, అరుణ, అనురాధ, యశోద ఉన్నారు.

విద్యుత్ సమస్యల పరిష్కారానికే బస్తీబాట


విద్యుత్ అధికారులు, కాలనీవాసులతో కలిసి టీ తాగుతూ సమస్యలను చర్చిస్తున్న కార్పొరేటర్

మన్సూరాబాద్: విద్యుత్ సమస్యలను నేరుగా పరిష్కరించేందుకు విద్యుత్ అధికారుల బస్తీబాట కార్యక్రమం శుభపరిణామమని మన్సూరాబాద్ కార్పొరేటర్ కొప్పుల నర్సింహారెడ్డి అన్నారు. హయత్‌నగర్ పరిధి వినాయక్‌నగర్‌కాలనీ ఫేజ్-2లో మంగళవారం విద్యుత్ అధికారులు చేపట్టిన బస్తీబాట కార్యక్రమానికి కార్పొరేటర్ హాజరై మాట్లాడారు. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని అనుసంధానం చేసి విద్యుత్ పంపిణీ వ్యవస్థను మరింత బలోపేతం చేయటం అవసరమన్నారు. విద్యుత్ అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించడంతో కొన్ని సమస్యలు తక్షణమే పరిష్కారం అవుతాయన్నారు. కాలనీల్లో సింగల్ ఫేజ్, త్రీఫేజ్ విద్యుత్ సమస్యలు, పాత స్తంభాలను మార్చటం, ప్రమాదకరంగా ఉన్న తీగలను సరిచేయటం లాంటి విద్యుత్ సమస్యలు పరిష్కారం అవుతాయని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ఏఈ మిరాజుద్దీన్, లైన్‌మెన్ యాదయ్య, దినేష్, కాలనీవాసులు వెంకట్‌రెడ్డి, ప్రవీణ్‌గౌడ్, రవితేజ, సంజీవరెడ్డి, పద్మారావు, యాదయ్య, మురళీధర్‌రెడ్డి, మల్లికార్జున్, రుక్మారెడ్డి పాల్గొన్నారు.


వైదేహినగర్‌లో వైర్లను సరిచేస్తున్న సిబ్బంది

నార్త్ వైదేహినగర్‌కాలనీలో..

ఎల్‌బీనగర్: సమస్యల పరిష్కారం కోసమే విద్యుత్ అధికారులు బస్తీబాట కార్యక్రమం నిర్వహిస్తున్నామని చంపాపేట డీఈ రాజేందర్‌కుమార్ అన్నారు. బీఎన్‌రెడ్డినగర్ డివిజన్ పరిధిలోని నార్త్ వైదేహినగర్‌కాలనీలో మంగళవారం విద్యుత్‌శాఖ అధికారులు బస్తీబాట కార్యక్రమంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బస్తీబాటలో విద్యుత్ సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరిస్తున్నామన్నారు. ఏఈ శివకుమార్ మాట్లాడుతూ.. విద్యుత్ స్తంభాల మధ్యన ఉన్న లో టెన్షన్ వైర్లు ఒకదానికి ఒకటి తాకుతున్నాయని ఈ సమస్యను పరిష్కరించామన్నారు. ట్రాన్స్‌పార్మర్ల వద్ద చెత్తను వేయకుండ కాలనీ వాసులు చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో కాలనీ అధ్యక్షుడు రాంబాబు, అన్నంరాజు శ్రీనివాస్, నాగరాజు, వేణుగోపాల్, ప్రభాకర్‌రావు,కిషోర్, శ్రీనివాస్, ఈమని కృష్ణ, పాల్ పాల్గొన్నారు.

అలుగు సమస్యకు పరిష్కారం చూపుతాం


కాలువను పరిశీలిస్తున్న మున్సిపల్, ఇరిగేషన్ శాఖల అధికారులు

తుర్కయంజాల్: పురపాలక సంఘం పరిధి ఇంజాపూర్‌లోని ఆపిల్ అవెన్యూ కాలనీలో మాసబ్ చెరువు అలుగు సమస్యకు శాశ్వత పరిష్కారం చూపుతామని కమిషనర్ కె.అమరేందర్ రెడ్డి, ఇరిగేషన్ డీఈ చెన్నకేశవరెడ్డి సూచించారు. ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి ఆదేశాల మేరకు మంగళవారం అధికారుల బృందం కాలనీలోని కాలువను పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ముందుగా కాలువపైన ఉన్న సీసీ రోడ్డు పూర్తిగా శిథిలావస్థకు చేరుకుందన్నారు. దాన్ని తొలగించి నీరు సులువుగా ప్రవహించేలా చేస్తామని పేర్కొన్నారు. ఆ తరువాత అంచనాలను రూపొందించి రిటైనింగ్ వాల్ నిర్మాణం చేపడతామని తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ డీఈ భిక్షపతి, ఏఈ చంద్రశేఖర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.